## క్లుప్తంగా

### పోస్టర్ ఆవిష్కరణ

12న ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 12వ తేదీన ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బాలోత్సవం రాష్ట్ర కార్యదర్శి ఎన్. సోమయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం సోమయ్య మాట్లాడుతూ.... 7, 8, 9వ తరగతులలో మెరిట్ సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం చేస్తామన్నారు. పాఠశాలల నుంచి విద్యార్థుల పేర్లను పంపించాలని ప్రధానోపాధ్యాయులను కోరారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను ప్రోత్సహించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

### క్యాబ్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

**చిక్కడపల్లి:** ట్యాక్సీ డ్రైవర్లకు ప్రభుత్వం ఒక యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలని తెలంగాణ యాప్ బేస్డ్ డ్రైవర్స్ ఫోరం నేతలు కోరారు. క్యాబ్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని బుధవారం కార్మికశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కార్మికశాఖ అదనపు కమిషనర్ డా. గంగాధర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఫోరం నేతలు గాజుల కిరణ్, నాగేశ్, శంకర్, మహేందర్, డేవిడ్, గోపాల్, వీరయ్య, అబ్దుల్ రావూఫ్ పాల్గొన్నారు.

### బీసీ రిజర్వేషన్లకు చట్టం చేయాలి

**కాచిగూడ:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు పార్లమెంట్‌లో చట్టం చేయాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమార స్వామి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. దశాబ్దాలుగా బీసీలు రిజర్వేషన్ల కోసం పోరాడుతుంటే.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. ఇప్పటికైనా కేంద్రం తన వైఖరిని మార్చుకుని రాష్ట్ర ప్రభుత్వం పంపిన బీసీ రిజర్వేషన్ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలన్నారు.

### విశ్వరచన సావనీర్‌ను ఆవిష్కరణ

**చిక్కడపల్లి:** తెలుగు భాషా సాహిత్య వికాసానికి పోతుకూచి సాంబశివరావు ఎంతగానో కృషి చేశారని ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. విశ్వసాహితీ సంస్థ, అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళనం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం అశోక్‌నగర్‌లోని కల్చరల్ సెంటర్‌లో పోతుకూచి సాంబశివరావు వర్ధంతిని నిర్వహించారు. పోతుకూచి స్మారక సంచిక విశ్వరచన సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు ఆచార్య గౌరీశంకర్, సత్యమూర్తి, వంశీ రామరాజు, పాత్తూరి సుబ్బారావు, బైసా దేవదాసు, తంగిరాల చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

### సంగీత గురువు తరంగిణి రామరాజుకు సత్కారం



**చిక్కడపల్లి:** పురాణం పురుషోత్తమశాస్త్రి ఎందరో సంగీత కళాకారులను సమాజానికి అందిచారని ఎమ్మెల్సీ మధుసూదనాచారి అన్నారు. త్యాగరాయ గానసభలో బుధవారం కర్ణాటక సంగీత విద్వాంసులు పురాణం పురుషోత్తమ శాస్త్రి శత జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సంగీత గురువు తరంగిణి రామరాజును సత్కరించారు. ఈ కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళా జనార్దనామూర్తి, ప్రముఖులు వంశీ రామరాజు, సుధాదేవి, శ్రీమణి తదితరులు పాల్గొన్నారు.

### పేకాట శిబిరంపై దాడులు

14 మంది అరెస్టు, రూ.60,500 స్వాధీనం

**చిక్కడపల్లి:** బాగ్‌లింగంపల్లి హౌజింగ్‌బోర్డు కాలనీ పేకాట శిబిరంపై చిక్కడపల్లి పోలీసులు బుధవారం మెరుపు దాడులు నిర్వహించారు. 14మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై మౌనిక తెలిపారు. బాగ్‌లింగంపల్లి హౌజింగ్ బోర్డుకాలనీలో రాంనగర్ ప్రాంతానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి రమేశ్‌రెడ్డి, వ్యాపారులు రాజగోపాల రెడ్డి, కాచిగూడకు చెందిన సిహెచ్.జనార్ధన్(54), తిలక్‌నగర్‌కు చెందిన కె.శ్రీనివాస్(57), హిమాయత్‌నగర్‌కు చెందిన నరేశ్‌కుమార్(50), మారుతీనగర్‌కు చెందిన ఎం.నరేందర్(57), వ్యవసాయం చేసుకునే నల్లకుంటకు చెందిన చక్రవర్ధన్‌రెడ్డి(50), లంకల జైపాల్(59), మీర్‌పేటకు చెందిన దానియా లోకారెడ్డి, రామంతాపూర్‌కు చెందిన జూలకంటి నాగేశ్వర్‌రావు(55) పేకాడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే వారు అక్కడకు చేరుకుని దాడులు నిర్వహించి జూదరులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 10 సెల్‌ఫోన్‌లు, సుమారు రూ.60,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. 14 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ తెలిపారు.



శంకరమఠం మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్‌ల పక్కనే చెత్తాచెదారం



గోల్నాక వెజిటబుల్ మార్కెట్ రోడ్డులో వీధి పక్కనే వ్యర్థాలు



నల్లకుంట లోకల్ లారీ లేన్ పక్కన పేరుకుపోయిన గృహనిర్మాణ వ్యర్థాలు



గోల్నాక కల్లు కాంపౌండ్ వద్ద రోడ్డుపైనే చెత్తాచెదారం

## బాధ్యతారాహిత్యం.. పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

చెత్తను స్వచ్ఛ ఆటోలు, డస్ట్‌బిన్స్‌లో కాకుండా వీధుల్లో వేస్తున్న వైనం

వర్షాకాలం వ్యాధులు వ్యాప్తి చెందకుండా జీహెచ్ఎంసీ కొన్ని రోజులుగా మాన్సూన్ శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా డీఎంసీ మారుతీదివాకర్, ఏఎంహెచ్‌వో డా. హేమలత, ఎంటమాలజీ అధికారులు, సిబ్బందితో ఇంటింటికీ వెళ్లి రోడ్లపై చెత్త వేయొద్దని.. నీటి తొట్టెలు, డ్రమ్ములు, పూల కుండీలలో నీరు నిల్వలేకుండా చూసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. ప్రత్యేక పాయింట్ల వద్ద ఏర్పాటు చేసిన చెత్త కుండీలలోనే చెత్తను వేయాలని లేదా స్వచ్ఛ ఆటో సిబ్బందికి ఇవ్వాలని కోరుతున్నారు. అయినా కొందరు దీనిని పెడచెవిన పెడుతున్నారు. బాధ్యత రాహిత్యంగా చెత్తను రోడ్లపై పడేసి వెళ్తున్నారు. ఇప్పటికైనా ప్రజలు జీహెచ్ఎంసీ సిబ్బందికి సహకరించి స్వచ్ఛ హైదరాబాద్‌కు సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

– నల్లకుంట



తిలక్‌నగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి ఇరువైపుల వ్యర్థాలు

## తీజ్ పండుగను అధికారికంగా నిర్వహించాలి

● సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్ర మోతీలాల్ నాయక్



ట్యాంక్‌బండ్‌పై రామదాసు విగ్రహం వద్ద జరిగిన తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న బంజారా మహిళలతో నేతలు

**కవాడిగూడ:** బంజారా సంస్కృతీ సంప్రదాయాన్ని చాటి చెప్పే పండుగలలో అతి ముఖ్యమైన పండుగ తీజ్ అని సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్ర మోతీలాల్ నాయక్ అన్నారు. ఈ పండుగ దేశ వ్యాప్తంగా ఉన్న బంజారాల ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇది కరువు నుంచి కాపాడే ప్రకృతి పండుగ అని తెలిపారు. తొమ్మిది రోజుల పాటు కఠోర నియమాలు పాటించి చేస్తారన్నారు. పెళ్లి కాని ఆడపిల్లలు, తోబుట్టువుల అను బంధాలతో పాటు లోకం సుభిక్షంగా ఉండాలని తీజ్ పండగను బంజారాలు నిర్వహిస్తారని తెలిపారు. సేవాలాల్ సేన ఆధ్వర్యంలో బుధవారం ట్యాంక్‌బండ్‌పై భక్త రామదాసు విగ్రహం వద్ద తీజ్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

**ఉత్సవాలకు వచ్చే మహిళలను అరెస్టు చేయడం దారుణం..**

ఈ సందర్భంగా మోతీలాల్ నాయక్ మాట్లాడుతూ... అతి పవిత్రమైన తీజ్ పండగకు గుర్తింపులేక పోవడం బాధాకరమని అన్నారు. ఈ పండుగను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. తీజ్ ఉత్సవాలకు వచ్చే బంజారా మహిళలను అరెస్టు చేయడం దారుణమని వాపోయారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన సంఘం ప్రధాన కార్యదర్శి ధరవాత్ గణేష్ నాయక్, విద్యార్థి నాయకులు అభిషేక్‌నాయక్, మహిళా నాయకురాలు, శాంతిబాయ్, సంఘం నాయకులు, నాగు నాయక్, సరితాబాయ్ మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రొ. జయశంకర్, గద్దర్, సుష్మాస్వరాజ్‌కు నివాళి

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొ.జయశంకర్ జయంతి, ప్రజాయుద్ధ నౌక గద్దర్, సుష్మాస్వరాజ్ వర్ధంతి సభలను బుధవారం నిర్వహించారు. చిక్కడపల్లిలో తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ ప్రతినిధులు వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్రను పోషించిన వీరిని గుర్తు చేసుకోవడం గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలరాజ్‌గౌడ్, సమన్వయ కమిటీ చైర్మన్ అయిలి వెంకన్నగౌడ్, బీసీ సమైక్య అధ్యక్షుడు దుర్గయ్యగౌడ్, నారాయణగౌడ్, బైరు శేఖర్, కేవీ గౌడ్, బడేసాబ్, ఐలన్‌గౌడ్, జెళ్ల రాజు, నరిసింహ తదితరులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ జయశంకర్, గద్దర్, సుష్మాస్వరాజ్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు

## గో ఆధారిత ఉత్పత్తులపై విద్యార్థులకు శిక్షణ



కాచిగూడ కళాశాలలో గో ఆధారిత రాఖీలను పంపిణీ చేస్తున్న మహేష్, ప్రిన్సిపాల్ చిరంజీవి

**కాచిగూడ:** ప్రభుత్వ కళాశాలల్లో గో ఆధారిత ఉత్పత్తులపై విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించే విధంగా ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నట్లు తెలంగాణ గోశాల ఫెడరేషన్ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ తెలిపారు. గోశాల ఫెడరేషన్ సహకారంతో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పణ్ ఆధ్వర్యంలో బుధవారం కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గోపేడతో తయారు చేసిన పర్యావరణ హిత రాఖీలను, మొబైల్ రేడియేషన్ చిప్స్‌ను ఆయన అందజేశారు. గో పేడ, న్యాచురల్ కలర్స్, విత్తనాలతో రాఖీలను తయారు చేసినట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ గో ఆధారిత ఉత్పత్తులను వాడాలని కోరారు. గో ఆధారిత ఉత్పత్తులు చేసే విద్యార్థులకు మార్కెటింగ్ వసతి కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిరంజీవి, లయన్స్ ఇంటర్నేషనల్ జంతు సంరక్షణ డిస్ట్రిక్ట్ చైర్మన్ ప్రేమ్‌చంద్ మునోత్ జైన్, గోశాలల డిస్ట్రిక్ట్ చైర్మన్ గోపాల్‌దాస్ అగర్వాల్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ న్యూలైట్ అధ్యక్షుడు రమేష్ కుమార్ పండిత్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మయ్య, లెక్చరర్స్ శ్రీనివాస్, గీతాబాయి, రాంమోహన్ పాల్గొన్నారు.

## ఎంవీఆర్ శాస్త్రిని పరామర్శించిన దత్తన్న



**చిక్కడపల్లి:** ఇటీవల అనారోగ్యానికి గురై కోలుకుంటున్న సంపాదకులు ఎంవీఆర్ శాస్త్రిని హరియాణ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పరామర్శించారు. చిక్కడపల్లిలోని సాయికృష్ణ అపార్ట్‌మెంట్‌లోని ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు టి.గోపాల్, దోనేటి సత్యం, శాస్త్రి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

**విద్యార్థులతో దత్తన్న ముఖాముఖి...**

ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిక్కడపల్లిలోని కొమురంభీమ్ స్టడీ సర్కిల్‌లో విద్యార్థులతో జరిగిన ముఖాముఖిలో బండారు దత్తాత్రేయ పాల్గొన్నారు. పోటీ పరీక్షలకు ఎలా సిద్ధమవ్వాలి? లక్ష్యాన్ని చేరుకునే వరకు నిరాశ నిస్పృహలకు అవకాశం ఇవ్వొద్దన్నారు.

**దత్తన్నకు సత్యాత్మతీర్థ స్వామి ఆశీర్వాదం**

**కాచిగూడ:** మధ్వాచార్య సత్యాత్మతీర్థ స్వామి కాచిగూడలోని ఉత్తరాధి మఠంలో చాతుర్మాస్య దీక్ష తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా బుధవారం మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ స్వామిజీని కలిసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణి, బీజేపీ నేతలు రమేష్‌యాదవ్, బల్వీర్, అశోక్ కులకర్ణి, శ్యామ్, అరవింద్, భీమ్‌రాజ్, సాయి, శ్రీకాంత్, ఓం ప్రకాష్, చిట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

### 10న దేశభక్తి పాటలు, కవితలు, నాట్య సంబురాలు

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** స్ఫూర్తి మ్యూజిక్, డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 10న దేశభక్తి పాటలు, కవితలు, నాట్య సంబురాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ సూర్యతేజ సుబ్రాంత్ మాస్టార్ తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగే ఈ కార్యక్రమంలో వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ పాల్గొనవచ్చని పేర్కొన్నారు. వివరాలకు ఫోన్ నం.96523 47207.

### సుష్మాస్వరాజ్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్ ఏర్పాటు చేయాలి

**అంబర్‌పేట:** తెలంగాణ ఆవిర్భావంలో తమదైన కీలకపాత్ర పోషించిన కేంద్రమంత్రి మాజీ సుష్మాస్వరాజ్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రూబీ స్టీవెన్‌సన్ డిమాండ్ చేశారు. బుధవారం సుష్మస్వరాజ్ వర్ధంతిని అంబర్‌పేటలో నిర్వహించి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రూబీ స్టీవెన్‌సన్ మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమానికి సుష్మాస్వరాజ్ వెన్నుదన్నుగా నిలిచారని గుర్తు చేశారు. ఆమె తెలంగాణ ఉద్యమానికి అందించిన ప్రోత్సాహాన్ని తెలంగాణ సమాజం ఎన్నటికీ మరువదన్నారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి పిండిగ వెంకన్న, నాయకులు బి.జాన్, దాస్, అఫ్సర్, అశోక్ పాల్గొన్నారు.

### మట్టికుప్పల తొలగింపు

**అంబర్‌పేట:** వర్షాలకు తలెత్తే ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం డీడీ పరిసర ప్రాంతాల్లో వర్షానికి రోడ్లపై భారీగా మట్టి, ఇసుకు పెద్ద ఎత్తున పేరుకుపోవడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు జీహెచ్ఎంసీ సిబ్బంది సహకారంతో తొలగింపజేశారు. అలాగే ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలు, నాల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆమె వెల్లడించారు.

## అసంపూర్తి ఫ్లైఓవర్ పనులను పూర్తి చేయండి

● అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**అంబర్‌పేట:** ఫ్లైఓవర్ నిర్మించి సర్వీసు రోడ్డు విస్మరించడంపై ఆర్అండ్‌బీ అధికారుల పట్ల ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అసహనం వ్యక్తం చేశారు. సుదీర్ఘకాలంగా నిర్మించిన ఫ్లైఓవర్ నేటికీ అసంపూర్తిగా ఉండటంతో స్థానికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని ఆయన అధికారులకు తెలిపారు. బుధవారం గోల్నాకలోని తన క్యాంపు కార్యాలయంలో ఆర్అండ్‌బీ ఈఈ ధర్మారెడ్డితో పాటు అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సర్వీసు రోడ్డు ఏర్పాటులో తీసుకోవాల్సిన చర్యలను తక్షణ తీసుకోవాలని సూచించారు. ఫ్లైఓవర్ కింద రెండు ప్రాంతాల్లో సర్వీసు రోడ్డు సమస్యతో పాటు ఇతర ప్రాంతాల్లో రోడ్డు సరిగా లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎనిమిదేళ్ల పాటు నిర్మించిన ఫ్లైఓవర్ ఎట్టకేలకు అందుబాటులోకి వచ్చినప్పటికీ సమస్యలమయంగా ఉందన్నారు. స్థానికులు ఫ్లైఓవర్‌తో అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో సర్వీసు రోడ్లు, ఇతర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు పాల్గొన్నారు.



అంబర్‌పేట ఫ్లైఓవర్ సర్వీసు రోడ్డు సమస్యపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



న్యూపటేల్‌నగర్‌లో పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**న్యూ పటేల్‌నగర్‌లో డ్రైనేజీ పనులు ప్రారంభం...**

ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. బుధవారం అంబర్‌పేట డివిజన్ న్యూ పటేల్‌నగర్‌లో రూ.2.50 లక్షల అంచన వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పైపులైన్ పనులను కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలో దశలవారీగా పైపులైన్ వ్యవస్థను ఆధునీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులతో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**సుందర య్య విజ్ఞాన కేంద్రం:** వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో ఓకులస్ ఐ హాస్పిటల్ సహకారంతో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 300 మంది వరకు కంటి పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పివి. నిరంజన్‌రెడ్డి, ఎస్.మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ... ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అయిలినేని కిషన్‌రావు, విభూది నాగభూషణం , నిమ్మల రాజేశేఖర్, టి.సైకిలాబ్ బాబు, కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



# తెలంగాణ సిద్ధాంతకర్తకు ఘన నివాళి

ఘనంగా ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి వేడుకలు



నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ వీఎస్ఆర్, బీఆర్ఎస్ నాయకులు



అశోక్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న నగర గ్రంథాలయ కార్యదర్శి పి.పద్మజ



గాంధీనగర్‌లో నివాళులర్పిస్తున్న లక్ష్మీగణపతి ఆలయ చైర్మన్ నర్సింగ్‌రావు

**అంబర్‌పేట:** తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక ప్రొ. జయశంకర్ అని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గోల్నాకలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రొ. జయశంకర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొ. జయశంకర్ చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రొ. జయశంకర్ తెలంగాణ ఉద్యమానికి మార్గదర్శకులుగా ఉన్నారన్నారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్వర్యంలో ప్రొ. జయశంకర్ జయంతిని నిర్వహించారు. జీహెచ్ఎంసీ సర్కిల్–16 కార్యాలయంలో ప్రొ. జయశంకర్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఎంసీ మారుతీదివాకర్, అధికారులు పాల్గొన్నారు.

**తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన గొప్ప దార్శనికుడు జయశంకర్**

**చిక్కడపల్లి:** నాలున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన గొప్ప దార్శనికుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ అని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో బుధవారం ప్రొ. జయశంకర్ సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్‌నగర్‌లో చౌరస్తాలోని ప్రొ. జయశంకర్ విగ్రహానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు ముఠా జైసింహ, ఎం.రాకేష్ కుమార్, శ్రీకాంత్, పున్నసత్యనారాయణ, ఆకుల శ్రీనివాస్, ముచ్చకుర్తి ప్రభాకర్, పాశంరవిలు పాల్గొన్నారు. గాంధీనగర్‌లో జరిగిన ప్రొ. జయశంకర్ జయంతి వేడుకల్లో లక్ష్మీగణపతి ఆలయం చైర్మన్ మారిశెట్టినర్సింగ్‌రావు, కాంగ్రెస్ నేతలు గుర్రంశంకర్ అభిషేక్‌కెన్నడీ, బాబ్జీ, జయేందర్‌బాబు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అశోక్‌నగర్‌లోని నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.పద్మజ, సీసీఎల్ గ్రంథపాలకులు సుబ్బలక్ష్మి, సీతా మహాలక్ష్మి, అవినాష్ జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



గోల్నాకలో ప్రొ. జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



జవహర్‌నగర్‌లో ప్రొ. జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్